ఇది మంచి ప్రభుత్వం

టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యేలు 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట శుక్రవారం నుంచి ప్రజల్లోకి వెళ్లడం ప్రారంభించారు. అధికారులతో కలిసి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. పాలనను గాడిలో పెడుతున్నామని, అన్ని హామీలను నెరవేరుస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు.

సంక్షేమ పాలనే ప్రభుత్వ లక్ష్యం

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

బెళుగుప్ప, సెప్టెంబరు 20: వైసీపీ నిరంకుశ పాలనతో గాడితప్పిన వ్యవస్థలను చక్కదిద్ది ప్రజా సంక్షేమ పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయిన సందర్భంగా రామసాగరంలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతామని, సంక్షేమ పథకాలను అందిస్తామని కలెక్టర్ అన్నారు. పొలంబడి, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర కార్యక్రమాల్లో కలసి పనిచేస్తామని అన్నారు. ఉపాధి పథకం అమలుతో సత్ఫలితాలు సాధిస్తున్నామని అన్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టించి, అధ్వాన్నంగా పాలన సాగించారని కేశవ్ విమర్శించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులెదురైనా కరువు కోరల నుంచి జిల్లాను గట్టెక్కిస్తామని అన్నారు. హంద్రీనీవా కాలువను ఆధునికీకరించి, 12 పంపుల ద్వారా కృష్ణాజలాలు తీసుకొస్తామని అన్నారు. త్వరలోనే నీటి పారుదలశాఖ మంత్రి ఇక్కడ పర్యటిస్తారని, హంద్రీనీవా పరిధిని పెంచేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అధికారులు మన ప్రభుత్వం అన్న ఆలోచనలతో పనిచేయాలని సూచించారు. అనంతరం రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ చేశారు. బెళుగుప్ప రేషన్ డీలర్-2 అక్రమాలపై కలెక్టరుకు టీడీపీ నాయకులు పెద్ద తిప్పయ్య ఫిర్యాదు చేశారు. సర్పంచ్ రామలక్ష్మి, ఆర్డీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దారు షర్మిల తదితరులు పాల్గొన్నారు. అంతకు మునుపు మంత్రి జనంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ఆలయాలను సందర్శించి, మొక్కులు నాటారు.



ఐదేళ్లపాటు ప్రజలు అరాచక పాలన చూసి విసుగు చెందారు. రానున్న ఐదేళ్లు సుపరిపాలన చూస్తారు. విపత్కర పరిస్థితుల్లో చంద్రబాబు ప్రజలకు మంచి పాలన అందిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలను గాలికి వదిలేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల్లోనే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాం.

- కనగానపల్లిలో ఎమ్మెల్యే పరిటాల సునీత



వైసీపీ ప్రభుత్వం పది రూపాయలు ఇచ్చి వంద లాక్కుంది. కూటమి అధికారం చేపట్టాక అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోంది. దీపావళి నుంచి ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తాం. పుట్లూరు మండలానికి హెచ్చెల్సీ నీరు అందిస్తాం. మూడుచెరువులను నింపుతాం. **- చాలకవేములలో ఎమ్మెల్యే బండారు శ్రావణి**



ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. పింఛన్లను రూ.4 వేలకు పెంచారు. 16,437 పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని వదిలారు. 175 అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదల ఆకలిని తీరుస్తున్నారు. **- రాయదుర్గంలో ఎమ్మెల్యే కాలవ**



అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కళ్యాణదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేశాం. దాదాపు 1500 మందికి ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇప్పించాము. విజయవాడ వరద బాధితులకు రూ.50 లక్షలకు పైగా సాయం అందించాము. వైసీపీ హయాంలో పింఛన్ల విషయంలో వివక్ష చూపించారు. చంద్రబాబు అర్హులందరికీ పెంచిన పింఛన్లు అందిస్తున్నారు.

- కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని



వైసీపీ హయాంలో రాష్ట్రం అప్పులపాలైంది. అనేక సవాళ్ల నడుమ చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. వంద రోజుల్లోనే ప్రజలకు ఎంతో మేలు చేశారు. మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు వంటి నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరానికి రూ.12,500 కోట్లను తెచ్చారు.

- రుద్రంపేటలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి



కూటమి ప్రభుత్వం మాటమీద నిలబడుతుంది. హామీ మేరకు పింఛన్లను పెంచింది. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. మెగా డీఎస్సీతో నిరుద్యోగులకు అండగా నిలిచింది. **- కసాపురంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం**

సీటుకో రేటు..!



రామ్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

రిజిస్ట్రేషన్ల శాఖలో బదిలీల హీట్



- ఆఫీసును బట్టి సబ్ రిజిస్ట్రార్ సీట్లకు డిమాండ్
- చక్రం తిప్పుతున్న అసోసియేషన్ నాయకులు
- రామ్‌నగర్ అంతా నేనే ఉంటా
- జాయింట్-2 రానివ్వకుండా ఓ సబ్‌రిజిస్ట్రార్ పట్టు
- అనంతపురం రూరల్‌కు రూ.40లక్షల పైమాటే..

అనంతపురం క్రైం, సెప్టెంబరు 20: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో అక్రమాదాయానికి కొదవ ఉండదనేది బహిరంగ రహస్యమే. అలాంటి శాఖలో బదిలీలు అంటే మామూలు విషయం కాదు. కొన్ని సీట్లు భారీగా విలువ పలుకుతున్నట్లు ఆ శాఖలో చర్చ సాగుతోంది. ఎంతైనా ఇచ్చుకునేందుకు పలువురు అధికారులు కూడా సిద్ధమైనట్లు సమాచారం. ఆ శాఖలో ప్రస్తుతం బదిలీల గోల సాగుతోంది. ముందు క్యాష్ కొట్టు... పోస్టు పట్టు అనే నినాదం వినిపిస్తోంది. ఆ శాఖలో సబ్‌రిజిస్ట్రార్లదే హవా. ఆ తరువాత ఇన్‌చార్జిగా పనిచేసే సీనియర్ అసిస్టెంట్ల వ్యవహారం కూడా బాగానే ఉంటుంది. ఆదాయం వచ్చే సీట్లపైనే సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లు ఇప్పుడు దృష్టి సారిస్తున్నారు. గతేడాదిలాగే ఈసారి కూడా బదిలీల్లో అసోసియేషన్ నాయకులే ముందుండి నడిపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగా అసోసియేషన్‌లో కీలకంగా ఉంటూ జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసే ఓ అధికారి చక్రం తిప్పుతున్నారని సమాచారం. గతేడాది బుక్కపట్నంలో ఏసీబీకి దొరికిన సబ్‌రిజిస్ట్రార్, ఈయనా కలిసి బదిలీల వ్యవహారం నడిపారు. ఉన్నతాధికారులకు ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి వీరే అంతా వసూలు చేస్తారని సమాచారం.

ఆ సీట్లకు ఫుల్ డిమాండ్...

రిజిస్ట్రేషన్ల శాఖలో బాగా ఆదాయమున్న సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు ఎప్పుడూ డిమాండే. అందులో ముందువరుసలో ఉండేది అనంతపురంలోని రామ్‌నగర్, రూరల్ ప్రధాన కార్యాలయాలు. పామిడి, గుంతకల్లు, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో ధర్మవరం, పెనుకొండ, చిలమత్తూరు పేర్లు వినిపిస్తున్నాయి. ఇక తాడిపత్రి, కళ్యాణదుర్గం కార్యాలయాలకు వెళ్లడానికి సబ్‌రిజిస్ట్రార్లు ఆసక్తి చూపట్లేదని సమాచారం. కొంతకాలంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇన్‌చార్జిలుగా సీనియర్ అసిస్టెంట్లే వ్యవహరిస్తున్నారు. వారిలో కొందరు వివాదాస్పద, 08 తదితర భూములకు రిజిస్ట్రేషన్లు చేస్తుండటంతో సబ్‌రిజిస్ట్రార్లకు సైతం బలం వచ్చిందట. వారే చేస్తుంటే తాము చేయలేమా అంటూ ఎక్కడికైనా వచ్చి చేస్తామంటూ చెబుతున్నారట. ఆదాయం ఎక్కువగా ఉన్న కార్యాలయాలపైనే దృష్టి సారిస్తున్నారని సమాచారం.

రామ్‌నగర్ అంతా నేనే ఉంటా...



అనంతపురం నగరంలోని రామ్‌నగర్ ఆర్‌ఓ కార్యాలయం కీలకం. ఇక్కడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1, జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2 పోస్టులున్నాయి. 8 నెలల ముందు ఇక్కడున్న జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. అప్పటి నుంచి కొన్నిసార్లు ఇద్దరు, ఒక్కోసారి ఒక్కరే పనిచేస్తూ వస్తున్నారు. ఈనేపథ్యంలో రామ్‌నగర్ ఆఫీసుకు రావడానికి పలువురు సబ్‌రిజిస్ట్రార్లు ఆసక్తి చూపుతున్నారని తెలిసింది. దీంతో పోటీ పెరిగింది. అనంతపురం నగరానికి పాతిక కిలోమీటర్ల లోపు ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ సబ్‌రిజిస్ట్రార్ విపరీతంగా ప్రయత్నిస్తున్నారట. జాయింట్-1లో తాను కూర్చుంటాననీ, జాయింట్-2 ఎవరికీ ఇవ్వకుండా చూడాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారట. దీంతో ఇప్పటికే ఆ సీటు కోసం ప్రయత్నిస్తున్న అధికారికి కుదరదని చెప్పడంతో మరోసీటు కోసం ప్రయత్నిస్తున్నారట. జాయింట్-1 సీటు కోసం ప్రయత్నిస్తున్న ఈ అధికారి నాలుగు నెలల క్రితం అనంతపురం రూరల్‌కు వచ్చారు. బేరాలు సరిగా కుదర్లేదే.. ఏమోగానీ మళ్లీ అదే సీటుకే వెళ్లిపోయారు. ఈసారి డబ్బునోట్లతో సంచులు నింపాలనే ఆలోచనలో ఆ అధికారి ఉన్నట్లు సమాచారం. ఈ సారుకు అసోసియేషన్ నాయకుడి అండ ఉండటంతో సీటు కన్ఫర్మ్ అయినట్లు సమాచారం. అనంతపురం రూరల్‌కు గత బదిలీల్లో ఓ అధికారి ఏకంగా రూ.35 లక్షలు ఇచ్చి మరీ ఆ సీటు తెచ్చుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాగానే ఆర్జించారన్న చర్చలు కూడా లేకపోలేదు. ఆయన మేనల్లుడు నగదుతో పట్టుబడి, ఈయన పేరు చెప్పడంతో అడ్రస్ గల్లంతైంది. ఖాళీ అయిన ఆ సీటు కోసం రూ.40లక్షలకుపైగా డిమాండ్ ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. కొన్ని సీట్లు రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు పలుకుతున్నాయట.



అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

వీరప్పన్‌లు ఎవరో..?

యల్లనూరులో శ్రీగంధం చెట్ల నరికివేత

- దుంగలను దోచుకెళ్లిన దుండగులు
- ఆలస్యంగా వెలుగులోకి ..

అడవిని కాపాడటానికి ప్రభుత్వం నియమించిన అధికారులు వారు. కానీ ఆ అడవిలో ఏమున్నాయో కూడా తెలుసుకోలేనంత నిర్లిప్తంగా వారు ఉద్యోగం చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జరుగుతున్న సంఘటనలే ఇందుకు అద్దం పడుతున్నాయి. విలువైన సంపదను కాపాడటంలో అటవీశాఖ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. - యల్లనూరు



శ్రీగంధం చెట్టు



శ్రీగంధం చెట్ల చిన్న ముక్కలను వదిలి వేసిన దుండగులు



రంపంతో చెట్టును కోయడంతో మిగిలిన కిందిభాగం

యల్లనూరు మండల కేంద్రానికి అర కిలోమీటర్ దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో జరుగుతున్న శ్రీగంధం చెట్ల స్మగ్లింగ్ ఆలస్యంగా శుక్రవారం వెలుగు చూసింది. యల్లనూరు-తాడిపత్రి రహదారికి పక్కనే 250 మీటర్ల దూరంలోపే ఉన్న చెట్లను నరికివేశారు. ఈ వ్యవహారం అధికారులకు తెలిసే జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. మూడురోజుల కిందట సుమారు 20కిపైగా శ్రీగంధం చెట్లను గుర్తుతెలియని దుండగులు నరికివేసినట్లు స్థానికులు తెలిపారు. యల్లనూరు పక్కన సుమారు 600ఎకరాల్లో అటవీప్రాంతం ఉంది. ఇక్కడ గతంలో ముంతమామిడి, సరుగుడు, వేప, అగ్గిపుల్లచెట్లు, తాటిచెట్లు అధికంగా ఉండేవి. కాలక్రమేణా అధికమైన బొగ్గుల బట్టీలకు ఈ చెట్లు ఆహుతయ్యాయి. అయితే ఇది సారవంతమైన భూమి కావడంతో ఇక్కడ శ్రీగంధం చెట్లు అక్కడక్కడ పెరిగి పెద్దవయ్యాయి. అయితే వీటిని ఫారెస్ట్ అధికారులు గుర్తించారో లేదో గానీ దొంగలు మాత్రం గుర్తించారు. అందుకే ఏమాత్రం భయంలేకుండా చెట్లను నరికి వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం బయటకు పొక్కకుండా వ్యవహరించారు. రాత్రి సమయంలో ఎలక్ట్రానిక్ మెషీన్ల సాయంతో శ్రీగంధం చెట్లను చిన్న చిన్న దుంగలుగా కోసుకున్నారు. ఈ దుంగలను తీసుకువెళ్లడానికి వీలుగా కాండం పైన ఉన్న భాగాన్ని అక్కడే తొలగించి నాణ్యమైన భాగాన్ని తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. వీటి విలువ లక్షల్లో ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. పశువులను మేపడానికి అడవిలోకి వెళ్లిన వ్యక్తులు గమనించడంతో ఈ విషయం బహిర్గతమైంది.

ఉన్నతాధికారులకు తెలియకుండా..

రిజర్వ్ ఫారెస్ట్‌లో లక్షలాది రూపాయలు విలువజేసే శ్రీగంధం చెట్లు ఉన్నాయన్న విషయం ఇక్కడి బీట్ అధికారులు ఉన్నతాధికారులకు తెలపలేదు. ఇక్కడి శ్రీగంధం చెట్లు నరికి తీసుకువెళ్లారన్న విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న ఉన్నతాధికారులు అలాంటి మొక్కలు మా ఫారెస్ట్‌లో ఉన్నాయా? అంటూ ఆశ్చర్యపోయినట్లు సమాచారం. ఈ దుంగల స్మగ్లింగ్ వెనుక ఇంటి దొంగల హస్తం ఉందని స్థానికులు గుసగుసలాడుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని రిజర్వ్ ఫారెస్ట్‌లో పెరుగుతున్న శ్రీగంధం చెట్లకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

అవగాహనకు ప్రత్యేక ప్రచారం.. సమీక్షలో కలెక్టరు, ఎస్పీ



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు, ఎస్పీ

అనంతపురం టౌన్, సెప్టెంబరు 20: మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం అవుతాయని, అందుకే వాటి వినియోగాన్ని నివారించడానికి కృషి చేద్దామని కలెక్టరు వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయికమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు ఉపయోగించకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈవిషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి పాఠశాల, కళాశాలల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారికి చికిత్స అందించడం కోసం జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేకంగా డీఅడిక్షన్ వార్డును ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలు జిల్లాకు సరఫరా కాకుండా ప్రత్యేక నిఘా పెడుతున్నామన్నారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు. మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి విద్యాశాఖతో కలిసి పాఠశాలలు, కళాశాల లో ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాలకు ప్రత్యేక వాహనం పంపించి ప్రచారం చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, డీటీసీ వీర్రాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఏఓ మారుతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పురిటి బిడ్డ విక్రయం


గుర్తించి.. స్వాధీనం చేసుకున్న అధికారులు

రాయదుర్గం, సెప్టెంబరు 20: గుమ్మఘట్ట మండలం నేత్రపల్లి గ్రామానికి చెందిన బళ్లారి రూపమ్మ అనే మహిళ 15 రోజుల క్రితం పుట్టిన తన కుమారుడిని రూ.80 వేలకు విక్రయించారు. కుటుంబ కలహాల కారణంగా భర్తకు దూరంగా, రాయదుర్గంలో ఆమె ఒంటరిగా ఉంటున్నారు. గర్భం ధరించిన ఆమెను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించి, అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్సలు అందించారు. అప్పటి నుంచి పుట్టే బిడ్డను అమ్మేస్తానని ఆమె చెబుతుండటంతో అధికారులు బంధువులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు స్పందించకపోవడంతో ప్రసవించేదాకా పర్యవేక్షించారు. 15 రోజుల క్రితం ఆమె మగ శిశువుకు జన్మనిచ్చారు. వైద్య ఆరోగ్యశాఖ, మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. శిశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు శుక్రవారం ఆమె ఇంటికి వెళ్లారు. అక్కడ శిశువు లేకపోవడంతో ఆరా తీశారు. వారం క్రితం రూ.80 వేలకు విక్రయించిన విషయం బయట పడింది. రాయదుర్గం పట్టణానికి చెందిన ఎరుకుల రాజశేఖర్‌కు దత్తత ఇచ్చినట్లు పత్రాన్ని గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించి, రాజశేఖర్‌ను స్టేషన్‌కు పిలిపించారు. సంతానం లేని తన సమీప బంధువులకు శిశువును ఇచ్చినట్లు అతను అధికారులకు తెలిపాడు. శిశువును తెచ్చి ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతికి అప్పగించాడు. శిశువును నేరుగా దత్తత ఇవ్వడం కుదరదని తల్లి రూపమ్మకు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే, తన ఆరోగ్యం సరిగా లేదని, తన తదనంతరం తన బిడ్డ బాగుండాలనే వారికి అప్పగించానని ఆమె చెప్పింది. సంతృప్తి చెందని అధికారులు, బిడ్డను శిశు సంక్షేమ కేంద్రంలో అప్పగించాలని నిర్ణయించారు. రాయదుర్గం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి, సంరక్షిస్తున్నారు.


ఊరు బడి వద్దు..!

ప్రైవేట్ పాఠశాలలకు గ్రామీణ విద్యార్థులు

సర్కారు బడికి ఒకరిద్దరే హాజరు



యాడికి మండలం కొట్టాలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒక్క విద్యార్థి



తిప్పారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరే విద్యార్థులు

గవర్నమెంట్ బడి అంటే జనాలకు మోజు పోయింది. ఆ బడికి పోతే పిల్లలకు మంచి చదువు రాదని అనుకుంటున్నారో ఏమో వేలకు వేలు ఫీజు కట్టి పక్క ఊళ్లలోని ప్రైవేట్ పాఠశాలలో చేరుస్తున్నారు. పిల్లలందరూ పక్క ఊరి బడికి వెళుతుంటే ఊళ్లో ఉన్న పాఠశాలలు కునారిల్లుపోతున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. యాడికి మండలంలోని కొట్టాలపల్లి, తిప్పారెడ్డిపల్లి గ్రామాల్లో ఒక్కొక్క పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. కొట్టాలపల్లి ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం ఒక్క విద్యార్థి మాత్రమే హాజరయ్యాడు. తిప్పారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాలకు వచ్చిన ఒకరు, ఇద్దరు విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు చెబుతూ కనిపించారు. నిట్టూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాలల పరిస్థితి ఇలాగే ఉంది. ఇక్కడ ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. కూర్మాజీపేట, రామరాజుపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు ఇదే కోవలోకి వస్తాయి. ఆ పాఠశాలల్లో కూడా పదికి లోపే విద్యార్థుల సంఖ్య ఉంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న కారణంగా గతంలోనే మండలంలోని తిరునాంపల్లి, కుందనకోట గ్రామాల్లో బడులు మూతపడ్డాయి. ఇప్పుడు ఆయా గ్రామాల్లోని విద్యార్థులు చదువుకోసం కిలోమీటర్ల దూరంలో ఉన్న వేరే గ్రామానికి వెళుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఇప్పటికే బడులు మూతపడిన గ్రామాలు, తక్కువ మంది విద్యార్థులు ఉండే బడులు ఉన్న గ్రామాల్లో విద్యార్థులు లేరా అంటే ఉన్నారు. వారంతా బస్సుల్లో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. **- యాడికి**

అవినీతే.. అభివృద్ధి లేదు

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం క్రైం, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వంద రోజుల పాలనలో అభివృద్ధి ఆరు అడుగులు వెనక్కు.. అవినీతి మూడు అడుగులు ముందుకు జరిగిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని అన్నారు. కొత్త ప్రభుత్వానికి ఐదారు నెలలు సమయం ఇవ్వాలని అనుకున్నామని, కానీ వంద రోజులుగా ప్రభుత్వం ప్రజలను మోసగిస్తోందని, ఆ విషయాలను చెప్పేందుకు బయటకు వచ్చామని అన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర ఖజానాలో రూ.100 కోట్లు మాత్రమే ఉందని, అయినా రూ.2.27 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టి సంక్షేమ పథకాలకు కేటాయింపులు చేశామని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చేనాటికి ఖజానాలో రూ.7వేల కోట్లున్నా పూర్తి స్థాయి బడ్జెట్ పెట్టలేకపోయిందని విమర్శించారు. ఇది మంచి ప్రభుత్వం పేరిట కార్యక్రమాలు చేస్తున్నారని, అసలు ఏం చేశారని ఈ ప్రభుత్వం మంచిదని ప్రశ్నించారు. రైతులకు రూ.20వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు అసలు పట్టించుకోవడం లేదని అన్నారు. వైసీపీ హయాంలో అమ్మఒడి కింద రూ.15 వేలు ఇచ్చామని, ఆ పథకం పేరును మార్చి.. అమ్మకు వందనం ఇవ్వకుండా నాన్నకు ఇంధనం ఇచ్చేందుకు రెడీ అయ్యారని విమర్శించారు. అక్టోబరు నుంచి రబీ సీజన్ ప్రారంభమవుతుందని, రైతుకు మంచి చేద్దామన్న ఆలోచన ఏ ఒక్కరికీ లేదని అన్నారు. శ్రీశైలం నిండినా హంద్రీనీవాకు నీరు రావడం లేదని, కర్నూలు సమీపంలో టీడీపీ నాయకుడు ఎన్‌హెచ్ పనులు చేస్తున్న కారణంగా 1350 క్యూసెక్కులకే పరిమితమయ్యారని, కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు దీని గురించి మాట్లాడటం లేదని అన్నారు. తుంగభద్ర జలాశయం నుంచి వచ్చే నీటి పరిస్థితి కూడా ఇలాగే ఉందని అన్నారు. ఇసుక పేరుతో గడిచి మూడు నెలలు దోపిడీ చేశారని అన్నారు. శాంతిభద్రతలు లోపించాయని, ఊరు విడిచిపోండని చెప్పే పరిస్థితిలో పోలీసులు ఉన్నారని అన్నారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పేకాట స్థావరాలు వెలుస్తున్నాయని ఆరోపించారు. తిరుమల లడ్డూల విషయంలో చంద్రబాబు ఒక మాట, ఈఓ శ్యామలరావు మరో మాట మాట్లాడుతున్నారని, లడ్డూలపై వచ్చిన ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

బ్రాండెడ్..!

- దుకాణాల్లో దొరకని నాణ్యమైన మద్యం
- పక్కదారి పట్టిస్తున్న సిబ్బంది


మద్యం ప్రియులు లేక ఖాళీగా ఉన్న షాపు

ఉరవకొండ, సెప్టెంబరు 20: దుకాణాల్లో అవసరమైన బ్రాండ్లు లేవని మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ సమయంలో వెళ్లినా డిస్‌ప్లేలో ఉన్న బ్రాండ్లు మాత్రమే మా దగ్గర ఉన్నాయి. బీర్లు అసలే లేవని దుకాణాల్లో పని చేసే సిబ్బంది సమాధానమిస్తున్నారు. బ్రాండ్లు ఏమీ లేనపుడు దుకాణాలను మూసివేస్తే సరిపోతుంది కదా అంటూ మందుబాబులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉరవకొండ మండల పరిధిలో ఉన్న నాలుగు మద్యం దుకాణాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ అక్టోబరు 1నుంచి అమలు కానుంది. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలు తొలగించి పాత పద్ధతిలో ప్రైవేట్‌కు అప్పగించనున్నారు. దీంతో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండేది కొన్నిరోజులేనని భావిస్తూ, అక్కడున్న సిబ్బంది చేతి వాటం చూపి, ఎక్కువ డిమాండ్ ఉన్న బ్రాండ్లు మాయం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసే సిబ్బంది అంతా వైసీపీతో అంటకాగిన వారే కావడంతో ఆ పార్టీకి సంబంధించిన వారికే బ్రాండ్ మద్యం అమ్ముతున్నట్లు బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి. బ్రాండెడ్ మద్యం దొరక్క పోవడంతో మద్యం ప్రియులు బార్‌ల వైపు పరుగులు పెడుతున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ కిషోర్‌ని వివరణ కోరగా, మద్యం దుకాణాల్లో బ్రాండ్లు ఉన్నా అమ్మక పోతే అలాంటి వారిపైన చర్యలు తీసుకుంటామన్నారు.

భార్యాభర్తల వైద్యం..

విద్యార్థికి సంకటం

- జ్వరానికి వైద్యం చేసిన మహిళా డాక్టర్
- సూదిమందు వేసిన ఆమె భర్త
- ఇన్‌ఫెక్షన్ అయ్యి ఆపరేషన్‌కు దారితీసిన పరిస్థితి


మరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 20: జ్వరం అని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే అక్కడ మహిళా డాక్టర్, ఆమె భర్త చేసిన వైద్యంతో ఓ విద్యార్థి తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. ఈఘటన జిల్లాకేంద్రంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కళ్యాణదుర్గం మండలం మాండ్రేవ్ గ్రామానికి చెందిన ప్రవీణ్ నగరంలోని సంగమేష్ నగర్‌లో ఉంటూ ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 17న అతడికి జ్వరం రావడంతో తన నివాసానికి సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ డాక్టర్ సుహాసిని పరీక్షించి సూది, మందులు రాసిచ్చింది. ఆమె రాసిచ్చిన ఇంజక్షన్‌ను డాక్టర్ గానీ డాక్టర్ అయిన ఆమె భర్త ఆ విద్యార్థికి వేశాడు. మరుసటిరోజు సూది వేసిన ప్రాంతంలో నొప్పి ప్రారంభం అయింది. ఆ రోజంతా నొప్పిని అలాగే భరించినా తగ్గకపోవడంతో గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు వెళ్లే ప్రాంతంలో ఉన్న మరో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నాడు. అక్కడ డాక్టర్ పరీక్షించి, ఇన్‌ఫెక్షన్ అయిందని చెప్పారు. అక్కడ సూది వేసారు సార్..! అదేకారణమా? అని ఆరాతీయగా ఆడాక్టర్ అవునని చెప్పాడు. అలాగే వదిలేస్తే మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పడంతో శుక్రవారం ఆపరేషన్ చేసి ఇన్‌ఫెక్షన్ తొలగించారు. ఇప్పటికే రూ.30 వేలు ఖర్చు అయ్యింది. పేద కుటుంబం కావడంతో డబ్బుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వచ్చీరాని వ్యక్తి సూది వేయడం వల్లే ఇలా జరిగిందని విషయాన్ని విద్యార్థి సంఘాల నాయకులు దృష్టికి బాధితులు తీసుకెళ్లారు. దీంతో వాళ్లు సూది వేసిన డాక్టర్ వద్దకు వెళ్లి విషయం చెప్పారు. కానీ ఆడాక్టరమ్మ మాకేమి సంబంధంలేదడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. బాధితులకు న్యాయం చేయాలని కోరినా ఆ మహిళా డాక్టర్ సమ్మతించలేదు. దీంతో ఈ విషయంపై కలెక్టరు, డీఎంహెచ్ఓలకు ఫిర్యాదు చేయనున్నట్లు విద్యార్థి సంఘం నాయకుడు సూర్యచంద్ర యాదవ్ తెలిపారు.

వైసీపీ నాయకుడి నుంచి రక్షణ కల్పించండి

- జిల్లా ఎస్పీని కలిసిన దేవగిరి గ్రామస్థులు


ఎస్పీని కలిసి బయటకు వస్తున్న దేవగిరి గ్రామస్థులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 20: మండలంలోని దేవగిరి గ్రామా నికి చెందిన సర్పంచ్ రాధిక భర్త, వైసీపీ నాయకుడు రాజ్‌కుమార్ నుంచి తమకు రక్షణ కల్పించాలని దేవగిరి గ్రామానికి చెందిన పలమనేరు సుబ్బరాయుడు, అప్పారావు, గోవింద, సుంకన్న, త్రినాథ్ తదితరులు శుక్రవారం జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు భూములను కబ్జా చేసి, అక్రమ కేసులు బనా యించి, తీసుకున్న అప్పులు చెల్లించకుండా, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించకుండా దౌర్జన్యానికి పాల్పడ్డాడని ఎస్పీకి వివరించారు. సుంకన్న వ్యవసాయ మోటార్‌కు విద్యుత్ లైన్ తీసుకెళ్లకుండా అడ్డుకున్నారని, ఆర్‌బీకేలో రైతు భరోసాపై అడిగేందుకు వెళితే అక్రమ కేసులు బనాయించారని గోవిందు ఎస్పీకి తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్నపుడు కొండ పోరంబోకు భూమిని దౌర్జన్యంగా కబ్జా చేసి కంచె వేసుకున్నాడని పలమనేరు సుబ్బరాయుడు తెలిపారు. కాంట్రాక్ట్ పనుల బిల్లులు తన ఖాతాలోకి మళ్లించుకుని ఇవ్వకుండా వేధిస్తున్నాడని త్రినాథ్ తెలిపారు. గ్రామంలో రాజ్‌కుమార్ అరాచకాలు మితిమీరాయని వైసీపీ అధికారంలో ఉన్నపుడు బండారు ఎర్రితాత కుటుంబ సభ్యులను వారంరోజుల పాటు గ్రామ బహిష్కరణ చేయించారని, వలంటీర్లతో అక్రమ కేసులు బనాయించడం, ఇప్పటికీ తామే సర్పంచ్‌గా ఉన్నామని, తమ మాటే చెల్లుతుందని బెదిరింపులకు పాల్పడుతున్నాడని వారు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కోరినట్లు వారు తెలిపారు.

కృత్రిమ డిమాండ్ సృష్టిస్తే చర్యలు

విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య



అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 20: జిల్లాలో అయిల్స్‌పై కృత్రిమ డిమాండ్ సృష్టిస్తే సహించేదిలేదని విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయంలోని తమ చాంబర్‌లో ఆయన పలు విషయాలను వెల్లడించారు. వంటకు వినియోగించే నూనెల్లో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు నిల్వచేసుకొని లేబుల్ ట్యాంపరింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టోరేజ్ పరిమితికి అనుగుణంగానే నిల్వ చేసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించి తమ సిబ్బంది తనిఖీల్లో పట్టుపడితే చర్యలు తప్పవన్నారు. డంప్ స్టోరేజ్‌పై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. 5 శాతం చెల్లించాల్సిన ట్యాక్స్ విషయంలో కూడా నిబంధనలను అతిక్రమించినట్లు పలుచోట్ల తనిఖీల్లో బయటపడిందని అన్నారు. ఎమ్మార్పీ లేబుల్ ట్యాంపరింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లాలో ఎక్కడైనా కల్తీలకు సంబంధించి గాని, నాణ్యత, తూకాలు సరిగా లేకపోవడంపై తమ కార్యాలయం ఫోన్ నెంబరు 8554-241249 కు వివరాలు చెప్పవచ్చు అన్నారు.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి

- సమ సమాజ స్థాపనకు తపించారు
- ఆయన ఆశయాలు సాధిద్దాం
- సంతాప సభలో రాజకీయ, ప్రజా సంఘాల నేతలు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 20: సమాజంలోని స్వార్థ రాజకీయాలు, ఆర్థిక అసమానతలు, శ్రమదోపిడీ, కార్పొరేట్ సంస్థల దోపిడీని రూపుమాపేందుకు నిర్విరామ పోరాటం చేసిన యోధుడు సీతారాం ఏచూరి అని ప్రజాప్రతినిధులు, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని లలితకళాపరిషత్‌లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాపసభ నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అధ్యక్షతన నిర్వహించిన సభకు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతోపాటు మౌ నం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ సీతారాం ఏచూరి బహుబాషా పరిజ్ఞానం కలిగిన గొప్ప నాయకుడన్నారు. ఢిల్లీలో దక్షిణ భారతదేశం పార్లమెంటేరియన్ల పట్ల చులకనభావం, చిన్నచూపు నెలకొన్న పరిస్థితుల్లో తెలుగువాడైన ఏచూరి ప్రతిభతో ఆ సంస్కృతిని అంతమొందించి ఆదర్శవంతుడిగా నిలిచారని అన్నారు. నూతన ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశానికి జరిగే ఉపయోగాలకన్నా నష్టాలు అధికంగా ఉన్న విషయాన్ని తెలియజేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఎందరో జీవితాలకు స్ఫూర్తిగా నిలిచారని, అందులో తానుకూడా ఉన్నానని అన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఆదర్శమైన రాజకీయాలను ప్రభావితం చేసిన నాయకుడు ఏచూరి అన్నారు. సిద్ధాంత పరంగా విభేదించినా ప్రజలకు అవసరమైన, ఉపయోగకరమైన అంశాలను ఏచూరి స్వాగతించేవారని, ఉపాధి హామీ పథకం అమలులో అప్పటి యూపీఏ ప్రభుత్వానికి ఎంతో సహకరించారని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ దేశం ఎన్నో గొప్ప సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో ప్రజాగొంతుక ఏచూరిని కోల్పోవడం బాధాకరమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ ఏచూరి తుదిశ్వాస వరకూ సమాజం కోసమే జీవించారన్నారు. ఆయన పార్థివ దేహాన్ని సైతం వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలనే దృఢనిశ్చయంతో సమర్పించిన గొప్ప వామపక్ష యోధుడని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ పేదలు, కర్షకులు, ఉద్యమాలకు జీవితాన్ని అంకితం చేసిన త్యాగమూర్తి సీతారాం అన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఓబులు మాట్లాడుతూ నిర్దిష్టమైన సిద్ధాంత అనుసంధానకర్తగా ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మాట్లాడుతూ ఏచూరి చూపిన మార్గంలో తామంతా నడుస్తామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వసీం, వివిధ రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు, ప్రముఖులు ఇంతియాజ్, రాఘవేంద్ర, ఏసురత్నం, చంద్రశేఖర్, వెంకటసుబ్బయ్య, పద్మజ, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ ప్రసూన, పెద్దన్న, డాక్టర్ భానుకిరణ్, నల్లప్ప, నాగేంద్రకుమార్, ఎస్ఎం బాషా, షేకన్న, కేవీ రమణ, గోవిందరాజులు, కంబదూరి నబిరసూల్, తరిమెల అమర్నాథరెడ్డి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.


ఏచూరి సంతాపసభకు పెద్దఎత్తున హాజరైన జనం


ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సంజు.. ఈశ్వరన్ శతకాలు

- నిరాశపరిచిన సూర్య కుమార్
- ఐదు వికెట్లు కూల్చిన నవదీప్ సైనీ
- ఆసక్తికరంగా రెండో రోజు మ్యాచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20: స్టార్ బ్యాట్స్‌మన్ సూర్యకుమార్ యాదవ్ బ్యాట్‌తో రెచ్చిపోతే చూడాలని ఆశించిన అనంత క్రీడాభిమానులకు నిరాశే ఎదురైంది. కేవలం ఐదు పరుగులకే 'స్కై' పెవిలియన్‌కు చేరింది. సంజు శ్యాంసన్, అభిమన్యు ఈశ్వరన్ సెంచరీలతో అలరించారు. ఏసీజీ-ఎ, బి మైదానాలలో దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు రెండో రోజు కొనసాగాయి. ఓవర్ నైట్ స్కోర్ 224-7తో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇండియా-ఎ జట్టు రెండో రోజు శుక్రవారం మరో 73 పరుగులు జోడించి 297 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 122 పరుగులతో ఇన్నింగ్స్ ఆరంభించిన శశావత్‌రావత్ రెండు పరుగులు మాత్రమే జోడించి 124 పరుగులకు ఔట్ అయ్యారు. మరో బ్యాట్స్‌మన్ ఆవేశ్‌ఖాన్ 16 పరుగులతో ఆరంభించి అర్ధ సెంచరీ పూర్తి చేసి అవుట్ అ య్యారు. ప్రసిద్ధ్ కృష్ణ 34 పరుగులు సాధించగా, అఖీబ్‌ఖాన్ డకౌట్ అయ్యా రు. ఇండియా-సి బౌలర్లలో వైశాక్ విజయ్‌కుమార్ 4 వికెట్లు, అన్షుల్ కాంబోజ్ 3 వికెట్లు, గౌరవ్ యాదవ్ 2 వికెట్లు పడగొట్టారు. ఆ తరువాత మొదటి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇండియా-సి జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 64 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది. ఓపెనర్లు రుతురాజ్ గైక్వాడ్ 17 పరుగులు, సాయి సుదర్శన్ 17 పరుగులు చేశారు. రజత్ పటిదార్ డకౌట్ కాగా, ఇషాన్ కిషన్ 5, మానవ్‌సుతార్ 2, అన్షుల్ కాంబోజ్ ఒక పరుగు చేశారు. బాబా ఇంద్రజిత్ 34 పరుగులతో రిటైర్డ్ హర్ట్ అయ్యారు. అభిషేక్ పోరెల్ 82 పరుగులు సాధించారు. పల్కిట్ నారంగ్ 35 పరుగులు, వైశాక్ 14 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఇండియా-ఎ బౌలర్లలో అఖీబ్‌ఖాన్ 3 వికెట్లు, శాంష్ ములాని 2 వికెట్లు, ఆవేష్ ఖాన్, తనుష్ కొటియాన్ చెరో వికెట్ తీశారు.


అభిమానులను నిరాశపరిచిన సూర్యకుమార్ యాదవ్


ఐదు వికెట్లుతో రాణించిన నవదీప్‌సైనీ

స్కై ఫెయిల్యూర్..

ఓవర్ నైట్ స్కోర్ 306-5తో రెండో ఆట ఆరంభించిన ఇండియా-డి జట్టు 349 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో రోజు 89 పరుగులతో ఇన్నింగ్స్ ఆరంభించిన సంజు శ్యాంసన్ 106 పరుగులు సాధించారు. నవదీప్‌సైని బౌలింగ్‌లో నితీష్‌కుమార్ రెడ్డికి క్యాచ్ ఇచ్చి వెనుతిరిగారు. శరాన్ష్ జైన్ మరో 4పరుగులు జోడించి 26 పరుగులకు ఔటయ్యారు. సౌరభకుమార్ 13 పరుగులు, అర్షదీప్ సింగ్ 11 పరుగులు చేయగా, ఆకాష్‌సేన్ గుప్తా డకౌట్ అయ్యారు. ఇండియా-బి బౌలర్లు నవదీప్‌సైనీ 5 వికెట్లు, రాహుల్ చాహర్ 3 వికెట్లు, ముకేష్‌కుమార్ ఒక వికెట్ తీశారు. ఇండియా-బి మొదటి ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ 170 బంతుల్లో 13 బౌండరీలు, ఒక సిక్సర్ సాయంతో మరోసారి బాధ్యాయుతంగా ఆడి 116 సాధించారు. మరో ఓపెనర్ జగదీషన్ 13 పరుగులు, సుయాష్ ప్రభుదేశాయ్ 16 పరుగులు చేశారు. జట్టులోకి చేరిన స్టార్ బ్యాట్స్‌మన్ సూర్యకుమార్ యాదవ్ (5) నిరాశ పరిచారు. ముషీర్‌ఖాన్ 5 పరుగులు సాధించగా, నితీష్‌కుమార్ రెడ్డి డకౌట్ అయ్యారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా-బి జట్టు 58 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 210 పరుగులు సాధించింది. వాషింగ్టన్ సుందర్ (39), రాహుల్ చాహర్ (0) క్రీజులో ఉన్నారు. ఇండియా-డి బౌలర్లలో అర్షదీప్ సింగ్ 3 వికెట్లు, ఠాకరే 2, సౌరభ్‌కుమార్ ఒక వికెట్ తీసుకున్నారు. దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ పోటీలను తిలకించారు.


అభివాదం చేస్తున్న అభిమన్యు


సూర్యకుమార్‌ను ఔట్ చేసిన ఆనందంలో ఇండియా ఏ జట్టు ఆటగాళ్లు


ట్రోఫీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ, మాంచోఫెర్రర్




క్రికెట్ పోటీలను ఆస్వాదిస్తున్న విద్యార్థులు

సిఫార్సులకు అగ్రతాంబూలం

'పంచాయతీ' బదిలీల కసరత్తు పూర్తి

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 20: ఉమ్మడి జిల్లాలో పంచాయతీల బదిలీల ప్రక్రియ ఎట్టకేలకు ముగించారు. పంచాయితీ కార్యదర్శుల బదిలీలకు సంబంధించి అనంతపురం, పుట్టపర్తి డీపీఓలు ప్రభాకర్‌రావు, విజయ్‌కుమార్, డీఎల్‌పీఓలు సుమనజయంతి, శివకుమారి శుక్రవారం ఉదయం నుంచి కసరత్తు చేసి ఎట్టకేలకు జాబితాను ఫైనల్ చేశారు. బదిలీల్లో సిఫార్సులకే పెద్ద పీట వేశారన్న ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలోని 1044 పంచాయతీలకు సంబంధించి సీనియార్టీకి అనుగుణంగా క్లస్టర్లకు సీనియర్లను నియమించి, ప్రతి పంచాయతీకి కార్యదర్శి ఉండేలా ప్రక్రియ ముగించినట్లు సమాచారం. అధికారులను సంప్రదించి తమకు కోరిన పంచాయతీ కావాలని విన్నవించుకున్నవారికి సైతనం.. స్థానిక నాయకుల నుంచి సిఫార్సు లెటర్ ఉండాల్సిందేనని ఉన్నతాధికారులు చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో చేసేది లేక తమకు ఉన్న పరిచయాలతో నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయక తప్పలేదని పలువురు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేలే కాకుండా వారి కుటుంబ సభ్యుల భాగస్వామ్యం కూడా ఉండడంతో పరిస్థితి ప్రశ్నార్థకరంగా మారింది. ఎమ్మెల్యే మొదట లెటర్ ఇచ్చిన వారి పేర్లు సైతం చివరి నిమిషంలో గల్లంతయ్యాయి. తాజాగా ఎవరు సిఫార్సు లేఖ ఇస్తే వారికి బెర్త్ ఖరారు చేస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. శనివారం జాబితా ప్రకటిస్తే కానీ ఎవరికి ఏ స్థానం దక్కిందో తెలుస్తుంది.

టీడీపీ నాయకుడిపై కేసు

హిందూపురం, సెప్టెంబరు 20: సచివాలయ ఉద్యోగితో ఫోన్‌లో దుర్భాషలాడి బెదిరించిన టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి శాసనకోట వెంకటేశ్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. రెండు రోజుల క్రితం శాసనకోటకు చెందిన గ్రామ సచివాలయ కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డితో ఉలవల పంపిణీపై ఫోన్‌లో దుర్భాషలాడాడు. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శుక్రవారం వెంకటేశ్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. 353(1), బీఎన్ఎస్ 92(ఎ), డిసెబులిటి యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పరిగి ఎస్ఐ రంగడు తెలిపారు.

జిల్లా రిజిస్ట్రార్ కొనసాగింపు

పుట్టపర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారిని కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖలో పలు జిల్లాల రిజిస్ట్రార్లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. కృష్ణకుమారిని శ్రీకాకుళం జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీచేసింది. తాజాగా కృష్ణకుమారిని జిల్లా రిజిస్ట్రార్‌గా కొనసాగిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారు.

అన్నదాతలను ఆదుకోవాలి

- అధికారులకు జడ్పీ చైర్‌పర్సన్ ఆదేశం
- ముగిసిన స్టాండింగ్ కమిటీ సమావేశాలు


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజ

అనంతపురం విద్య, సెప్టెంబరు 20: అడవి జంతువుల దాడితో పంటలు నష్టపోతున్న అన్నదాతలను ఆదుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జడ్పీలోని సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ గిరిజ అధ్యక్షతన, సీఈఓ ఓబులమ్మ ఆధ్వర్యంలో ఏడు స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. కొందరు సభ్యులు మాట్లాడుతూ... రొద్దం, లేపాక్షి, తదితర ప్రాంతాల్లో అడవి పందుల దాడి ఎక్కువగా ఉందని, మొక్కజొన్నలు తినేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. రైతులకు మేలు చేసేలా ఏమి చర్యలు తీసుకుంటారని చైర్‌పర్సన్ అధికారులను ప్రశ్నించారు. అటవీ శాఖాధికారులు స్పందిస్తూ.....అడవి జంతువుల వల్ల పంట నష్టపోయిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందని, దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ విషయం తమకే తెలియదని, ఇక రైతులకేం తెలుస్తుందని పలువురు సభ్యులు పేర్కొన్నారు. జడ్పీ చైర్మన్ కలుగజేసుకుని ఈ అంశంపై కరపత్రాల ద్వారా విస్తృతమైన ప్రచారం కల్పించాలని, చైతన్యం తేవాలని సూచించారు. గతంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మంజూరైన పనులు కొన్ని తీర్మానాలు లేక ఆగిపోయాయని, మరికొన్ని సగంలో ఉంటే...కొన్ని పూర్తయ్యాయన్నారు. బిల్లులు వస్తాయా..రావా అనే సందేహం చాలా మందిలో ఉండిపోయిందన్నారు. దీనికి సీఈఓ, ఇంజనీర్లు మాట్లాడుతూ.. పనులు పూర్తయితే...తప్పకుండా చెల్లిస్తారంటూ హామీ ఇచ్చారు. ఉరవకొండ, బుక్కరాయసముద్రం ప్రాంతాల్లో ఇంకుడు గుంతల పనులకు బిల్లులు చెల్లించాలని, విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్ చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సభ్యులు కోరారు. తర్వాత అంగన్‌వాడీల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


హాజరైన జడ్పీటీసీ సభ్యులు, అధికారులు

వైసీపీ నాయకుడిపై చీటింగ్ కేసు

కదిరి, సెప్టెంబరు 20: సాధారణ ఎన్నికల్లో కదిరి నుంచి పోటీ చేసి ఓడిపోయిన వైసీపీ అభ్యర్థి బీఎస్ మగ్బూల్ అహ్మద్‌పై పోలీసులు చీటింగ్, ఫోర్జరీ, పత్రాల మార్పిడి నేరాల కింద కేసు నమోదు చేశారు. మగ్బూల్‌తోపాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేశామని కదిరి పట్టణ సీఐ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. కడప జిల్లా పులివెందులకు చెందిన బీపీ రమణారెడ్డి కదిరిలో నివసిస్తున్నారు. 2005లో కదిరిలోని ఓ చర్చి స్థలాన్ని బత్తలపల్లికి చెందిన పీటర్‌పాల్, కదిరికి చెందిన పరికి షామీర్, అర్షాద్, మహమ్మద్ ముస్తఫా, ఎస్.ముస్తఫాతో కలిసి రమణారెడ్డి రూ.20 లక్షలకు కొనుగోలు చేశారు. చర్చివారికి అడ్వాన్సుగా రూ.18 లక్షలు చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నారు. ఆ తరువాత స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించేందుకు చర్చివారు నిరాకరించారు. దీంతో కొనుదారులు అనంతపురం కోర్టును ఆశ్రయించారు. విచారించిన కోర్టు, కొనులుదారులకు 2007లో అనంతపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చింది. ఆ తరువాత రమణారెడ్డికి తెలియకుండా మిగిలిన ఐదుగురు ఆ స్థలాన్ని హిందూపురానికి చెందిన హిదయతుల్లా అనే వ్యక్తికి 2008లో విక్రయించారు. రమణారెడ్డి పేరును ఫోర్జరీ చేశారు. కదిరికి చెందిన లక్ష్మీనారాయణ, గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మక్బూల్ అహ్మద్ అన్ని విషయాలు తెలిసీ సాక్షులుగా సంతకం చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ అని తెలిసి డాక్యుమెంట్ రైటర్ సలీంబాషా డాక్యుమెంట్‌ను రాశాడు. దీంతో బాధితుడు రమణారెడ్డి తన భాగస్వాములు ఐదుగురితోపాటు మొత్తం ఎనిమిది మందిపై కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మార్కెట్ యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శిగా గోవిందు


బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శి గోవిందు

అనంతపురంరూరల్, సెప్టెంబరు20: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శిగా కె గోవిందు నియమితులయ్యారు. ఆ మేరకు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూల్ యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శిగా పనిచేస్తూ ఓడిపై అనంతపురానికి వచ్చారు. ఈ సందర్భంగా యార్డు కార్యదర్శి, సూపర్ వైజర్లు, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీకేపల్లి తహసీల్దార్‌గా సురేశ్‌కుమార్


తహసీల్దార్ సురేశ్‌కుమార్

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 20: మండల తహసీల్దార్‌గా సురేశ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ హమీద్ బాషా శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న సురేశ్‌కుమార్‌ను మండల తహసీల్దార్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయండి

మార్కెట్ శాఖ జేడీ రామాంజనేయులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు20: మార్కెట్ కమిటీ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆ శాఖ జేడీ రామాంజనేయులు సూచించారు. నగరంలోని మార్కెటింగ్ శాఖ జేడీ కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడిజిల్లా మార్కెట్ కమిటీల ఏడీలు, కార్యదర్శుల తో సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీగా లక్ష్యాలపై చర్చించారు. ఆర్థిక సంవత్సరంలో నెల లక్ష్యాలను పెట్టుకుని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడిజిల్లాల ఏడీలు సత్యనారాయణచౌదరి, మూర్తి, ఎంపికశ్రేణి కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నాటక ప్రదర్శన

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 20: నగరంలోని లలితకళాపరిషత్ ఆవరణలో శనివారం సాయంత్రం 6 గంటలకు ఉచిత నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పరిషత్ కార్యదర్శి పద్మజ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరిషత్ మాజీ ప్రధాన కార్యదర్శి గాజుల నారాయణస్వామి 80వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి, అనంతరం శకుని పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కళాకారులు, కళాభిమానులు విరివిగా తరలిరావాలని కోరారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 20: అనంతపురం నగరపాలికలో శుక్రవారం సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆరు విభాగాలైన వార్డు అడ్మిన్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ సెక్రటరీ, వార్డు శానిటేషన్ సెక్రటరీ, వార్డు అమెనిటీస్ సెక్రటరీ, ప్లానింగ్ సెక్రటరీలకు బదిలీలు జరిగాయి. ఇందులో మ్యూచువల్, స్పౌజ్, మెడికల్ గ్రౌండ్స్ తదితర విభాగాల్లో కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లాలోని మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో జరిగింది. కౌన్సిలింగ్ ప్రక్రియను ఆర్డీ విశ్వనాథ్, నగర కమిషనర్ నాగరాజులు పర్యవేక్షించారు. మొత్తం 250 మంది ఉద్యోగులు బదిలీల్లో పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించండి

● డీఎస్పీ వెంకటేశ్వర్లు

గార్లదిన్నె, సెప్టెంబరు 20 : పెండింగ్‌లో ఉన్న కేసులను విచారించి, త్వరితగతిన పూర్తి చేయాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు స్థానిక పోలీసు అధికారులకు సూచించారు. ఆయన శుక్రవారం సాయంత్రం గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసుల గురించి ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌ను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు ప్రతి పోలీస్ అధికారి కృషి చేయాలని సూచించారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్ల సీజ్

గార్లదిన్నె, సెప్టెంబరు 20 : శింగనమల నియోజకవర్గంలో ఎక్కడైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్ హెచ్చరించారు. పామిడి నుంచి అనంతపురానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను ఎస్ఐ మహమ్మద్‌గౌస్ శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. అదేవిధంగా కల్లుమడి నుంచి ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పాపినేపాళ్యం వద్ద సీఐ కౌలుట్లయ్య పట్టుకున్నారు. వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

ఇసుక తవ్వుతున్న ఎక్స్‌కవేటర్...

శింగనమల, సెప్టెంబరు20: మండలంలోని పెద్ద జలాలపురం గ్రామ సమీపంలోని వంక నుంచి కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలించేందుకు ప్రయత్నిస్తుండగా గ్రామస్థులు పట్టుకున్నారు. వంకలో ఇసుక తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకుని 100 డయల్ చేసి, సమాచారం ఇచ్చారు. సీఐ కౌలుట్లయ్య ఆదేశాలతో పోలీసులు అక్కడికి చేరుకుని ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి శింగనమల పోలీసు స్టేషన్‌కు తరలించారు.

రోడ్డుప్రమాదంలో ఉపాధి కూలీ మృతి

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 20: మండలంలోని బసినేపల్లి క్రాస్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఉపాధి కూలీ మృతిచెందాడు. బసినేపల్లికి చెందిన జెన్నే క్రిష్టయ్య (64) ఉపాధి పని ముగించుకుని ద్విచక్రవాహనంలో గ్రామానికి వెళుతున్నాడు. ఈ క్రమంలో పెనుకొండవారిపల్లికి చెందిన రాఘవేంద్రరెడ్డి బసినేపల్లి నుంచి ద్విచక్రవాహనంలో ఎన్ఎస్‌గేట్ వైపు వెళుతూ ఎదురుగా క్రిష్టయ్య ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో క్రిష్టయ్య కు తీవ్ర గాయాలు కాగా అనంతపురంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. రాఘవేంద్రరెడ్డి కూడా స్వల్పంగా గాయపడ్డాడు. మృతుడి కుమారుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసుకున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గార్లదిన్నె, సెప్టెంబరు 20 : మండల పరిధిలోని మర్తాడు గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసులు (34) అనే యువకుడు బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మర్తాడు గ్రామానికి చెందిన దాసరి రాజేశ్వరి కుమారుడు శ్రీనివాసులు వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గత కొంతకాలంగా కడుపుతో బాధపడుతుండేవాడు. పలు ఆస్పత్రులలో వైద్యం చేయించారు. అయితే గురువారం కడుపునొప్పి తీవ్రం కావడంతో జీవితం పై విరక్తి చెంది ఇంట్లో పురుగుల మందుతాగి అపస్మారకస్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్ట్

అనంతపురం క్రైం, సెప్టెంబరు20: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అందిన సమాచారం మేరకు నగరంలోని నాయకనగర్ సమీప ప్రాంతంలో శుక్రవారం టూటౌన్ సీఐ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. కంపచెట్ల మధ్యలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.23,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వంద రోజుల్లోనే ఎంతో మేలు చేశాం

ఎమ్మెల్యే దగ్గుపాటి


ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 20 : అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ప్రజలకు ఎంతో మేలు చేసి చూపించామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట పంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడి... వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. పలు ఇళ్లకు ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయం చేసిందన్నారు. ఇలాంటి కష్ట సమయంలోనూ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే అనేక హామీలు అమలు చేసిందన్నారు. ఓ వైపు వరదలు, మరోవైపు అనేక సవాళ్లు ఎదురైనా సీఎం చంద్రబాబు సమర్థవంతంగా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాలోకేశ్ మంచి పాలన దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికుమార్, నాయకులు మల్లికార్జున, రాయల్ మురళి, గంగారామ్, సరిపూటి రమణ, లక్ష్మీనరసింహ, శ్రీనివాస్‌రెడ్డి, పోతుల లక్ష్మీనరసింహులు, ఎస్ఎం బాషా, నాగభూషణం, బాలప్ప, సుధాకర్, మహేష్, అంజి, ఆది, శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే క్లీన్ అండ్ గ్రీన్ : ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 20 : ప్రజల భాగస్వామ్యం, సహకారం ఉంటేనే క్లీన్ అండ్ గ్రీన్ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని చిల్డ్రన్స్ పార్క్‌లో శుక్రవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలు నాటి నీరు పోశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, నగర కమిషనర్ నాగరాజు, టీడీపీ నాయకులు బుగ్గయ్య చౌదరి, సరిపూటి రమణ, బల్లా పల్లవి, సుధాకర్ యాదవ్, నారాయణస్వామి యాదవ్, వెంకటేశ్వరరెడ్డి, రమేష్, జనసేన నాయకులు ఇమామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

అనంతపురంరూరల్: మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం మనందరి బాధ్యతని కందుకూరు పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని క్రిష్ణంరెడ్డి పల్లి ప్రభుత్వ పాఠశాల ఆవారణలో శుక్రవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పాలనలో ఎమ్మెల్యే దగ్గుపాటి మార్క్

మాజీ మేయర్ స్వరూప

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 20 : వంద రోజుల పాలన ప్రగతిలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ తన దైన మార్క్ చూపించారని మాజీ మేయర్ స్వరూప శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిపాలనలో పట్టు బిగిస్తూ పంచాయతీల్లో కోట్లాది రూపాయల ఎన్ఆర్‌జీఎస్ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలు ఆయన దృష్టికి వెళ్లిన ప్రతి సమస్యకు సత్వర పరిష్కారం చూపుతున్నారన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకొని నగర అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. రాబోవు రోజుల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి నేతృత్వంలో గతంలో ఎన్నడూ చూడని విధంగా నగరం అభివృద్ధి చెందడం ఖాయమన్నారు.

రూరల్ డీఎస్పీని కలిసిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



అనంతపురం రూరల్ డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లను నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శింగనమల నియోజకవర్గం పరిధిలో శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేయాలని కోరారు. - శింగనమల

ఎస్పీని కలిసిన గౌస్‌మొద్దీన్



ఎస్పీ జగదీష్‌ను గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఎస్పీని కలిసి శాలువ కప్పి, పండ్లు అందజేశారు. - అనంతపురం అర్బన్

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక


హనుమంతురాయుడు


కుళ్లాయిస్వామి

అనంతపురం విద్య, సెప్టెంబరు 20: జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నట్లు ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. అధ్యక్షుడిగా హనుమంతరాయుడు, ప్రధాన కార్యదర్శిగా కుళ్లాయిస్వామి, ఆఫీస్ బేరర్లుగా నరసింహయాదవ్, సాయిస్వరూప, రాధాజ్యోతి, వెంకటనాయక్, ఆంజనేయులు, వంశీ, మంజునాథ్, చందుతోపాటు 21 మంది కార్యవర్గాన్ని, 45 మంది కౌన్సిల్‌తో కార్యవర్గాన్ని కళ్యాణదుర్గంలో జరిగిన జిల్లా మహాసభల్లో ఎన్నుకున్నామన్నారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోటారాలు సాగిస్తామన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

అక్కినేనికి అభిమానుల నివాళి


అక్కినేని పాటలు పాడుతున్న కళాకారులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 20 : అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతిని పురస్కరించుకుని అనంత నాగ్ సంగీత్ స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన అభిమానులు నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని కృష్ణకళామందిర్‌లో శుక్రవారం సాయంత్రం తొలుత నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన మ్యూజికల్‌నైట్‌లో అక్కినేని నాగేశ్వరరావు నటించిన సినిమాల పాటలను అలరించారు.

అన్న క్యాంటిన్‌కు రూ.లక్ష విరాళం


మంత్రికి చెక్కును అందజేస్తున్న అమృత ఇన్‌ఫ్రా సభ్యులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 20 : అన్న క్యాంటీన్ నిర్వాహణకు మండలంలోని నారాయణపురానికి చెందిన శ్రీ అమృత ఇన్‌ఫ్రా సభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆ చెక్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు శుక్రవారం అందించారు. విరాళం ఇచ్చిన వారిలోసోముల నాగరాజు, బత్తల రాజగోపాల్, అసుండి రామకృష్ణ, జీకే సురేష్, రామాంజినేయులు, సుబ్బయ్య, గణేష్‌సాయిరాం, అమర్‌నాథ్ ఉన్నారు. అలాగే అనంతపురం నగరానికి చెందిన టీడీపీ నాయకుడు రాఘవేంద్ర చౌదరి అన్న క్యాంటీన్ కోసం రూ.50వేలు ఎమ్మెల్యేకి అందజేశారు. వరదబాధితుల కోసం ఏఎస్ఆర్, సెవెన్‌హిల్స్ టమోట మండీల నిర్వాహకులు గురు, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు మణికంత బాబు, ఎమ్మెల్యేకి రూ. 5లక్షల చెక్కు అందజేశారు.


ఎమ్మెల్యేకి చెక్కు ఇస్తున్న మండీల నిర్వాహకులు

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి : ఎస్టీయూ

నార్పల, సెప్టెంబరు20: ఉద్యోగ, ఉపాధ్యాయులకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణా రెడ్డి, రామాంజనేయులు డిమాండ్ చేశారు. నార్పల మండలంలోని వివిధ పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి రావాల్సిన బకాయిల కోసం ఉద్యోగ, ఉపాధ్యా యులు ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే దీర్ఘకాలిక బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ ప్రకటన జాప్యం అవుతున్న నేపథ్యంలో వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30శాతం ఐఆర్ ప్రకటించాలని, 117జీఓను రద్దు చేయాలని, పని సర్దుబాటు అసంబద్ధాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మండల నాయకులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో దేవర సందడి


ఆనందోత్సాహాల్లో అభిమానులు

అనంతపురం, సిటి, సెప్టెంబరు 20 : జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర చిత్రం విడుదల నేపథ్యంలో స్థానిక సప్తగిరిసర్కిల్ సమీపంలోని మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా 50 అడుగుల దేవర కటౌట్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా డిస్ట్రిబ్యూటర్ మేనేజర్ యతీంద్ర, గౌరి థియేటర్ యజమాని వెంకటక్రిష్ణారెడ్డి హాజరయ్యారు. కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. ఎన్టీఆర్ అభిమానులు తిరుపాల్, జాఫర్, ఇర్షాద్, గౌస్, బుద్ధు, కిషోర్, భరద్వాజ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వాడకం.. హానికరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సాయినాథ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు20 : మత్తు పదార్థాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని పలువురు వక్తలు సూచించారు. ఈ మేరకు శుక్రవారం రామ్‌నగర్‌లోని బీసీ బాలికల వసతిగృహంలో విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకం-ఆరోగ్యానికి హానికరం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ అధ్యక్షతన జరిగిన సదస్సుకు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ సాయినాథ్, టూటౌన్ సీఐ శ్రీకాంత్, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమాల నోడల్ ఆఫీసర్ డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మత్తు పదార్థాల వాడకం అత్యంత ప్రమాదకరమని సూచించారు. ఏబీసీడబ్ల్యూఓ రంగమ్మ, వైద్యులు బాలాజీ నాయక్, వెంటకలక్ష్మి, ఎన్‌సీసీ ఆఫీసర్ రంగనాథ్, జూటూరు రమేష్, వార్డెన్లు ఉషా, రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

హోరాహోరీగా స్కూల్ గేమ్స్


చెన్నేకొత్తపల్లిలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 20: స్థానిక ఉన్నతపాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ పోటీలు హెచ్ఎం ఓబుళమ్మ ఆధ్వర్యంలో హోరాహోరీగా జరిగాయి. మొదటి రోజు అండర్-14,17 క్యాటగిరీలలో బాలికలకు పోటీలు నిర్వహించారు. మొత్తం 150 మంది బాలికలు పాల్గొన్నారు. క్రీడలు, అథ్లెటిక్స్ పోటీలలో పలు పాఠశాలల బాలికలు ప్రతిభను కనబరిచినట్లు పీడీ నల్లప్ప తెలిపారు. .ఈ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు విజయనిర్మల, అంజన్న, కుమార్, సుధాకర్, మహేశ్వరి, కొండమ్మ పాల్గొన్నారు.

రాప్తాడు: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులను నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశామన్నారు. హెచ్ఎం సాంబ శివ, స్కూల్ గేమ్స్ మండల కన్వీనర్ కేశవమూర్తి, రాజశేఖర్, రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప తదితరులు పాల్గొన్నారు.


నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన రాప్తాడు క్రీడాకారులు

శింగనమల: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పోటీలను ఎంఈఓ-2 శివప్రసాద్ ప్రారంభించారు. మండలంలోని అన్ని జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


కబడ్డీలో విజేతలుగా నిలిచిన పెరవలి పాఠశాల విద్యార్థులు

ఐదేళ్లు అరాచక పాలన చూశాం

ఇక సుపరిపాలనే.. : ఎమ్మెల్యే పరిటాల సునీత


తూంచెర్లలో శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి, సెప్టెంబరు 20: ఐదేళ్ల పాటూ అరాచక పాలన చూసి విసుగు చెందాం, రానున్న ఐదేళ్లు సుపరిపాలన చూస్తారని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా ముత్తవకుంట్లలో భూమిపూజ చేసి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం బాలేపాళ్యం, కనగానపల్లి, తూంచెర్ల, తగరకుంట, వేపకుంట, మద్దెల చెరువు గ్రామాల్లో రూ. 3.60 కోట్లతో సీసీ రోడ్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కనగానపల్లిలో రైతు సురేష్ పొలంలో ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కల పెంపకంలో భాగంగా మామిడి మొక్కలు నాటారు. ఆయా గ్రామాల్లో గ్రామ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లను ఇంటింటికీ వెళ్లి అతికించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు ప్రజలకు మంచి పాలన అందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 26 కోట్లు పనులకు శ్రీకారం చుట్టామన్నారు. రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని, ఎన్నికల హామీలు నెరవేరుస్తామన్నారు. గత టీడీపీ హయాంలో రూ. 5 కోట్ల ఈఏపీ నిధులతో మంజూరైన రంగంపేట, సీఎన్‌కోట, తూంచెర్ల, తగరకుంట రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. కార్యక్ర మంలో ఈఓఆర్డీ అనిల్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, మండల కన్వీనర్ యాతం పోతులయ్య, నాయకులు సుధాకర్‌చౌదరి, ముకుంద నాయుడు, బిల్లే బాస్కర్, బట్టా సురేష్ చౌదరి, సర్పంచులు అంజి, సోమర చంద్రశేఖర్, రామకృష్ణ, మాధవ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

'వంద రోజుల్లోనే మంచి ప్రభుత్వంగా గుర్తింపు'


నాగసముద్రంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం


చెన్నేకొత్తపల్లిలో...

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 20: అధికారంలోకి వచ్చిన వంద రోజు ల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజల నుంచి మన్ననలను అందుకుంటోందని టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు పేర్కొన్నారు. మండలంలోని నాగసముద్రం, చెన్నేకొత్తపల్లిలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ప్రసన్న కుమార్ నాయుడు, ఈఓఆర్డీ అశోక్‌నాయక్, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర, యజ్ఞేశంకర్, ఈడిగ బాస్కర్‌గౌడ్, చంద్రాయుడు పాల్గొన్నారు.


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

రామగిరి, సెప్టెంబరు 20: కష్టాల్లో ఉన్న రాష్ట్ర ప్రజలకు మేలు చేసే విధంగా సీఎం చంద్రబాబు పాలన సాగుతోందని టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కంటిమద్దిరంగయ్య పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి అయిన సందర్భంగా మండల పరిధిలోని శ్రీహరిపురం గ్రామంలో శుక్రవారం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అదే విధంగా గరిమేకలపల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి ఆధ్వర్యంలో 'ఇది మన మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందిస్తూ ప్రభుత్వం అందించిన అభివృద్ధి, సంక్షేమం గురించి తెలియజేశారు. బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించడం పట్ల రంగయ్య హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, ముత్యాలు, మల్లెల ఆంజనేయులు, వారాది, శేషు, మారుతి, రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

నియామకం

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు20 : బీసీ సంక్షేమ సంఘం యువజన జిల్లా అధ్యక్షుడిగా మనోజ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా కేశవ్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు శుక్రవారం బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌బాబు సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మనోజ్, కేశవ్‌ను ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు.

శిక్షణ పేరుతో వేలాది రూపాయల వసూలు

● కోచ్‌పై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20: ఉచిత శిక్షణ అంటూనే డొనేషన్ పేరుతో క్రీడాకారుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయల వసూళ్లకు పాల్పడుతున్న తైక్వాండో కోచ్ రామాంజినేయులుపై చర్యలు తీసుకోవాలని జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గురుస్వామి అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు, డీఎస్‌డీఓ షఫీని వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ కోచ్‌గా అర్హత లేకపోయినప్పటికీ హౌసింగ్ బోర్డులోని రాజీవ్‌చిల్డ్రన్స్‌పార్కులో పిల్లలకు తైక్వాండో శిక్షణ పేరుతో మభ్యపెడుతున్న కోచ్ రామాంజినేయులుపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కోచ్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. కమిషనర్, డీఎస్‌డీఓ స్పందిస్తూ విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని బదులిచ్చినట్లు తెలిపారు.

23న బధిరుల వాలీబాల్, చెస్ క్రీడా పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20 : జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ది డెఫ్ ఆధ్వర్యంలో బుక్కరాయసముద్రం సమీపంలోని ఆర్డీటీ బధిర పాఠశాలలో ఈనెల 23వ తేదీన బధిర క్రీడాకారులకు వాలీబాల్, చెస్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణ, సత్యనారాయణ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని బధిర కీడ్రాకారులు పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నం. 9493362154కు వాట్సాప్ ద్వారా సందేశం పంపాలని కోరారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు నసనకోట విద్యార్థులు


రాష్ట్ర స్థాయికి ఎంపికైన జయసింహ, కావ్య

రామగిరి, సెప్టెంబరు 20: మండలంలోని నసనకోట ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్టు పీడీ చామంతి, హెచ్ఎం నాగరత్న తెలిపారు. ఈనెల 19న అనంతపురం గుడ్ చిల్డ్రన్స్ స్కూల్‌లో జరిగిన అండర్-14 క్యాటగిరిలో జిల్లా స్థాయి జూడో పోటీలలో 25 కేజీల విభాగంలో జయసింహ, 40 కేజీల విభాగంలో కావ్య ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 22 నుంచి 24 వరకు తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ


బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన డీఎస్పీ

తాడిపత్రి, సెప్టెంబరు 20: పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీగా రామకృష్ణుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుమునుపు డీఎస్పీగా ఉన్న జనార్దన్‌నాయుడు అడిషనల్ ఎస్పీగా ప్రమోషన్‌పై వెళ్లారు. ఈయన స్థానంలో ఇంటిలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న రామకృష్ణుడును నియమించారు. నూతన డీఎస్పీకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

తహసీల్దార్‌గా రజాక్‌వలి ..

తాడిపత్రి, సెప్టెంబరు 20: పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నూతన తహసీల్దార్‌గా రజాక్‌వలి బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి తహసీల్దార్ బాలాజీ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. కొంత కాలం క్రితం ప్రభుత్వం ఈశ్వరమ్మను తహసీల్దార్‌గా నియమించినప్పటికీ.. ఆమె ఇక్కడికి రావడానికి సుముఖంగా లేదు. దీంతో కలెక్టరేట్‌లో పనిచేస్తున్న రజాక్‌వలిని నియమించారు.

ఘర్షణ కేసులో ఆరుగురి అరెస్టు

తాడిపత్రి, సెప్టెంబరు 20: పట్టణ సమీపంలోని బుడగజంగాల కాలనీలో ఈనెల 11వ తేదీన వినాయక నిమజ్జనం సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణ కేసులో శుక్రవారం ఆరుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. నిమజ్జనం రోజున బుడగజంగాల కాలనీకి చెందిన వెంకటేష్‌పై గంగరాజు, గంగాధర, రవితో పాటు మరో ముగ్గురు దాడికి దిగారు. ఈ ఘర్షణలో వెంకటేష్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

తాడిపత్రి, సెప్టెంబరు 20: పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో గురువారం రాత్రి ఆర్టీసీ డ్రైవర్ కంబగిరిపై గుర్తుతెలియని ఆకతాయిలు దాడి చేశారని పోలీసులు తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన కంబగిరి ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా అతడు బస్టాండ్ నుంచి బయటకు వస్తుండగా కొందరు ఆకతాయిలు అడ్డగించారు. దీంతో ఎవరు మీరు నన్ను ఎందుకు అడ్డుకుంటున్నారని కంబగిరి ప్రశ్నించాడు. అంతలోపే ఆకతాయిలు రాళ్లతో కొట్టి అతని వద్ద ఉన్న రూ.2500 నగదు, లైసెన్సు, ఏటీఎం కార్డులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, సెప్టెంబరు 20: మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపంలో శుక్రవారం ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1550 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి చుక్కలూరు గ్రామానికి చెందిన పెద్దిరాజు, నారప్ప, శ్రీరాములును అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల పోస్టర్ల విడుదల

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 20: పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో నిర్వహించే దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వాహకుడు కేశవ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అంబేడ్కర్ నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. అక్టోబరు 3న ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ముత్యంస్వామి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి, సెప్టెంబరు 20: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకతాన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను ప్రోత్సహించడానికి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల మంత్రిత్వ శాఖల ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు చెప్పారు . 18నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివిధ అంశాల పై సృజనాత్మక ఆలోచనలను ఈనెల 26లోపు గేట్స్ కళాశాలలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన ఐడియాలకు రూ.15లక్షల ఆర్థిక సాయం లభిస్తుందని ఆయన తెలిపారు.

కెంచానపల్లిలో వైద్యశిబిరం

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 20: మండలంలోని కెంచానపల్లి గ్రామంలో శుక్రవారం ఆవులదట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాజేంద్రప్రాద్ ఆధ్వర్యంలో సిబ్బంది వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇటీవల జ్యోతి అనే మహిళ విష జ్వరంతో మృతి చెందింది. దీంతో వారు గ్రామంలో పర్యటించి వైద్యశిబిరం చేపట్టారు. ఇందులో గ్రామస్థులకు రక్తపరీక్షలు, వివిధ వైద్య సేవలు అందించారు. అనంతరం మృతి చెందిన మహిళ ఇంటి వద్దకు వెళ్లి కుటుంబసభ్యుల్ని పరామర్శించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ రామాంజనేయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 20: పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరిగింది. ఇందులో ఎయిర్‌టెల్ పేమెంట్స్, అమర్‌రాజా బ్యాటరీస్, వికాస , రిలయెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాకి 151 మంది అభ్యర్థులు హాజరుకాగా అందులో 81 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ లెక్చరర్ సోమ్లానాయక్, డీఆర్‌డీఏ కో ఆర్డినేటర్ ఓబులేష్, ఏపీఎస్ఎస్‌డీసీ కో ఆర్డినేటర్ రాము, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హర్ష, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

గుత్తి, సెప్టెంబరు 20: పట్టణంలోని బండగేరికి చెందిన దాదాఖలందర్ అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన మైనర్ బాలికను వెంట పడి వేధింపులకు పాల్పడుతుండటంతో ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారిచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

17మందిపై కేసు..

గుత్తి, సెప్టెంబరు 20: పట్టణంలో తాడిపత్రి రోడ్డులో తన స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించారని మహమ్మద్ అనే వ్యక్తి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. దీంతో విచారణ అనంతరం మహమ్మద్ స్థలాన్ని ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జమీల్‌తోపాటు మరో 16మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.


రాయదుర్గంలోని సమావేశంలో ఇదిమంచి ప్రభుత్వం పోస్టర్‌ను చూపుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


కళ్యాణదుర్గంలో పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని


కసాపురంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్

చంద్రబాబు వంద రోజుల పాలన సక్సెస్

● ఇది మంచిప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు

రాయదుర్గంటౌన్, సెప్టెంబర్ 20: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు విజయవంతంగా పూర్తవడంతో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని పట్టణంలోని 29వ వార్డులో శుక్రవారం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయిందన్నారు. భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. అధికారంలోకి రాగానే పింఛన్లను రూ. 3 వేల నుంచి రూ. 4 వేలకు పెంచారన్నారు. అలాగే మెగా డీఎస్సీతో 16437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తొలి సంతకం చేశారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నారన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు రూ.5 నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం ఇన్ని మంచి పనులు చేసిందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర‌రెడ్డి, టీడీపీ నాయకులు టంకశాల హనుమంతు, సంపత్‌కుమార్, పురుషోత్తం, ఇనాయత్, ఫకృద్దీన్, వివిధ శాల అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: మండలంలోని సీబావి, ఒంటిమిద్దిగ్రామాలతో పాటు పట్టణంలోని వడ్డే కాలనీల్లో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు నిర్వహించారు. తొలుత అధికారులు, కూటమి నాయకులో కలిసి ఇది మంచి ప్రభుత్వం పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే పింఛన్‌దారులకు రూ. 7 వేల పింఛన్ అందించి మాట నిలబెట్టుకుందని గుర్తు చేశారు. అలాగే ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు అందిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తోందన్నా రు. వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన పంచాయతీలను కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులను విడుదల చేసి జీవం పోసిందన్నారు. ఇక తమ వంతు సాయంగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో నిరుద్యోగులకు తమ వంతు సాయంగా డీఎస్సీ ఉచిత కోచింగ్ ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చామన్నారు. వరదలతో అతలాకుతలమైన విజయవాడకు కళ్యాణదుర్గం ప్రాంత ప్రజలు వెళ్లి రూ. 50 లక్షలు నగదు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆయా శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గుంతకల్లు: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి కావడంతో మండలంలోని కసాపురం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామ సభను నిర్వహించారు. ఇందుకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన సూపర్ సక్సెస్ అన్నా రు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేసే దిశగా పని చేస్తోందన్నారు. వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల కాలంలోనే పనిచేసే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నిరూపించారన్నారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశ్, పత్తి హిమబిందు, పాల మల్లికార్జున, జనసేన నాయకుడు మణికంఠ పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని చాలవేముల గ్రామంలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇందులో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ల పెంపు, ఉచిత ఇసుక, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, మెగా డీఎస్సీ విడుదల తదితర వాటిని అమలు చేశారని తెలిపారు. వచ్చే దీపావళికి ప్రతి ఇంటికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామన్నారు. అనంతరం గ్రామంలో సమస్యలపై అర్జీలను స్వీకరించారు. మండలానికి హెచ్చెల్సీ నీరు అందించి మూడుచెరువులను నింపుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుదర్శన్‌నాయుడు, బాలరంగయ్య, కులశేఖర‌రెడ్డి, జీసీ బాబు, శ్రీనివాసులునాయుడు తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం

కూడేరు: మండలకేంద్రంలో శుక్రవారం అధికారులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమ వాల్ పోస్టర్లను ఎంపీడీవో ఆవిష్కరించారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ చౌదరి, అధికారులు ఇంటింటికీ వెళ్లి వాటిని అతికించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

బొమ్మనహాళ్: మండలకేంద్రంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ షకీలాబేగం, ఈఓపీఆర్డీ దాస్, వ్యవసాయాధికారి సాయికుమార్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సర్పంచ్ వన్నమ్మ, టీడీపీ నాయకుడు పయ్యావుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

డీ.హీరేహాళ్: ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఓబుళాపురం గ్రామంలో తహశీల్దార్ అనిల్‌కుమార్‌తో కలిసి తెలుగుదేశం, జనసేన శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వీఆర్వో దేవేంద్ర, లాయర్ పంపాపతి తదితరులు పాల్గొన్నారు.

జీబీసీకి సాగు నీరు విడుదల

● మంత్రి కేశవ్ ఆదేశాలతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిన అధికారులు


కాలువలో పూడిక తీయిస్తున్న అధికారులు

విడపనకల్లు, సెప్టెంబరు 20: గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌కు శుక్రవారం సాగునీటిని జీబీసీ అధికారులు మండల రైతుల సహాయంతో విడుదల చేశారు. జీబీసీకి పూర్తి స్థాయిలో సాగునీరు అందక ఆయకట్టు భూముల్లో పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొంది. దీనిపై గత గురువారం ఆంధ్రజ్యోతిలో చివరికి నష్టమేనా అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం అనంతపురంలో జరిగిన ఐఏబీ సమావేశం అనంతరం హెచ్ఎల్‌సీ, జీబీసీ అధికారులతో సాగు నీటి విషయం చర్చించారు. హెచ్ఎల్‌సీలో నీటి సామర్థ్యాన్ని పెంచి జీబీసీకి చివరి ఆయకట్టు వరకూ సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఆయా అధికారులు తెలిపారు. ఎన్ని అడ్డంకులున్నా తొలగించి చివరి ఆయకట్టు వరకూ సాగు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని తెలిపారన్నారు. దీంతో జీబీసీ అధికారులు శుక్రవారం ఉదయం మండలంలోని జీబీసీ జీరో బై జీరో వద్దకు చేరుకున్నారు. వీరికి తోడుగా టీడీపీ మండల నాయకులు, ఆర్ కొట్టాల, డోనేకల్లు, విడపనకల్లు, పాల్తూరు గ్రామాల రైతులు చేరుకుని కాలువలో అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. అధికారులు ఎస్కవేటర్‌ను తెప్పించి కాలువలో పేరుకుపోయిన మూడు, నాలుగు, అడుగుల మేర ఉన్న పూడికను తీయించారు. అలాగే అడ్డుగా ఉన్న చెట్లు, రాళ్లు, ముళ్ల కంపలను తొలగించారు. ప్రస్తుతం 250 నుంచి 300 క్యూసెక్కుల వరకూ సాగు నీరు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కా ర్యక్రమంలో ఈఈ వెంకటరమణ, డీఈఈ రఘుచరణ్, ఏఈఈలు మంజు నాథ, రాజశేఖర్, పల్లవి, పవన్, టీడీపీ నాయకులు చల్లా ఎర్రిస్వామి, మద్దిపాట్ల శ్రీనివాసులు, బొజ్జప్ప, మారయ్య, సర్వోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

డీ.హీరేహాళ్, సెప్టెంబరు 20: మండలంలోని లింగంపల్లి గ్రామంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. లింగంపల్లికి చెందిన ఎల్లప్ప, శుక్లమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు హనుమంతరాయుడు(29) తండ్రికి చేదోడుగా వ్యవసాయ పనులకు వెళ్తుండేవాడు. కాగా కొన్ని రోజులుగా అతడికి ఆరోగ్యం సరిగా లేదు. ఈ క్రమంలో వివాహం కూడా కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను గురువారం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. అనంతరం అదే గ్రామంలో ఉన్న తన చెల్లి తిప్పమ్మ ఇంటి వద్దకు వచ్చి విషయం చెప్పాడు. వెంటనే ఆమె కుటుంబసభ్యులకు తెలియజేయగా వారు అతన్ని చికిత్స కోసం బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

నేడు గడేకల్లులో మంత్రి కేశవ్ పర్యటన

విడపనకల్లు, సెప్టెంబరు 20: మండలంలోని గడేకల్లు గ్రామంలో రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం పర్యటించనున్నట్లు టీడీపీ మండల నాయకులు ముండ్లూరు శీనివాసులు, భీమలింగప్ప, శ్రీనివాస చౌదరి, సీతారాముడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ముందుగా గడేకల్లులోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఎస్సీకాలనీలో ఏర్పాటు చేసిన జనం బాట కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలపై చర్చిస్తారని అన్నారు.

అండర్-19 కుస్తీ పోటీలకు జట్లు ఎంపిక

పామిడి, సెప్టెంబరు 20 : పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరం వద్ద గల భవనంలో శుక్రవారం అండర్-19 జిల్లా స్థాయి కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ మండలాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-19 బాలికల ఫ్రీ స్టైల్ విభాగంలో మాలిని, మైత్రి, మౌనిక, శ్రావణి, శృతి, చంద్రకళ, ఎస్ స్పందన, మానస ఎంపికైనట్లు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కుస్తీ కోచ్ రాఘవేంద్ర తెలిపారు. అలాగే బాలుర విభాగంలో ప్రవీణ్ నారాయణ, ఎస్ ఎండీ దావుద్, ఎస్ మల్లికార్జున, కార్తీక్, రోషన్‌ఖాన్, ఎండీగౌస్, యశ్వంత్, రంగస్వామి, అండర్-19 గ్రీకో రోమన్ కుస్తీ బాలుర విభాగంలో మధు, సంతోష్, అన్వర్ ఎంపికైనట్లు తెలిపారు. కృష్ణా జిల్లా జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో అక్టోబర్ 3వ తేదీ నుంచే జరిగే రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఈ ఎంపికలో అండర్-19 స్కూల్ గేమ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, టీసీహైస్కూల్ పీడీ నాగరాజు, రామకృష్ణ, మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యవిద్యను ప్రైవేటీకరణ చేయడం అన్యాయం



గుత్తిలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 20: వైద్యవిద్యను ప్రైవేటీకరణ చేయడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఈ మేరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడు తూ 2024-25సంవత్సరం నూ తన మెడికల్ కళాశాలలను నడపలేమని ఎన్ఎంసీకు ప్రభుత్వం లేఖ రాయడం దౌర్భాగ్యం అన్నారు. ప్రభుత్వం వైద్యవిద్యను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ప్రైవేటీకరణను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకీ, కిషోర్, నవీన్, మణికంఠ, సాయి, చందు, ఫిరోజ్, చరణ్, వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: వైద్యవిద్యను ప్రైవేటీకరణ చేసే యోచనను తక్షణమే మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద మోకాళ్లపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం మెడికల్ కళాశాలలను మూసివేసే ప్రయత్నం చేస్తోందన్నారు. వెంటనే ఆ ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు బాలు, నవీన్‌యాదవ్, శివ, వినోద్‌కుమార్, చంద్ర పాల్గొన్నారు.

రక్తదానం శిబిరం

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 20: ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా పట్టణంలోని గోసాబావి వద్ద వినాయక ఆలయంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జింక వసుంధర, పట్టణ అధ్యక్షుడు అంబోజీరావు నిర్వహించారు. 50 మంది యువకులు రక్తదానం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొని రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ హీరోజీరావు, ప్రధాన కార్యదర్శి శివకుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలవకు మైనార్టీల సన్మానం

రాయదుర్గంటౌన్, సెప్టెంబరు 20: పట్టణంలోని అన్వరుల్ ఉలుమ్ మదరసాలో మైనార్టీ కమిటీ వారు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు సన్మానం చేశారు. శాలువా కప్పి, పూలమాలలు ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మదరసాలో దాదాపు 85 మంది విద్యార్థులకు ఖురాన్‌ను నేర్పిస్తూ వారు ఒక మంచి జీవితానికి అలవాటు పడే విధంగా బలమైన పునాదులు వేయడం హర్షదాయకమన్నారు. మానవత్వం పరిమళించే విధంగా మదరసాలో క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసాన్ని చేపట్టడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టంకశాల హనుమంతు, బండి చిన్న, పూజారి శివ, హనుమంతరెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

దోమ తెరలు తప్పక వాడాలి

కూడేరు, సెప్టెంబరు 20: వర్షాకాలంలో దోమలు అధికంగా ఉంటాయని, సీజనల్ జ్వరాలు వచ్చే అవకాశముంటుందని, కనుక ప్రతిఒక్కరూ దోమతెరలు తప్పక వాడాలని జిల్లా మలేరియా నివారణాధికారి ఓబులు సూచించారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో పర్యటించారు. మురుగు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమలు అధికంగా ఉంటాయని, పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలిపారు. దోమల మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు వచ్చే అవకాశముందన్నారు. రాత్రి సమయాల్లో వేపాకు పొగ తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల మైదానంలో గుంతలు పూడ్చివేత

తాడిపత్రి, సెప్టెంబరు 20: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పడ్డ గుంతలను పూడ్చివేసి చదునుచేసే పనులను శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర‌రెడ్డి సొంత నిధులు వెచ్చించి మైదానానికి నూతన హంగులు తీర్చిదిద్దుతున్నారు. ఎక్సకవేటర్ సాయంతో గుంటలు పూడ్చివేసి చదును చేస్తున్నారు. కొన్నేళ్లుగా పరిష్కారం కాని ఈ సమస్యను ఎమ్మెల్యే పరిష్కరిస్తుండడంతో క్రీడాకారుల్లో ఆనందం నెలకొంది. పనులను టీడీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డిలు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ


ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్న ఎస్పీ జగదీష్

కూడేరు/ఉరవకొండ, సెప్టెంబరు 20: కూడేరు, ఉరవకొండ పోలీస్‌స్టేషన్లను ఎస్పీ జగదీష్ శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. తొలుత కూడేరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఆయన అక్కడి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల తనిఖీలో భాగంగా ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. విధుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఉరవకొండ అర్బన్, రూరల్ పోలీస్‌స్టేషన్లను సదర్శించారు. ఆయన వెంట గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు సురేష్‌బాబు, శివరాముడు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత


రామసాగరంలో మంత్రి, కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న నిస్వార్థ సేవా సంస్థ సభ్యులు

ఉరవకొండ, సెప్టెంబరు 20: విజయవాడ వరద బాధితులకు సాయమందించడానికి పలువురు ముందుకు వచ్చారు. ఉరవకొండకు చెందిన ఎస్కేఆర్సీ క్లబ్ సెక్రెటరీ రామాంజినేయులు, అధ్యక్షుడు రేగాటి నాగరాజు శుక్రవారం మంత్రి పయ్యావుల కేశవ్‌ను అనంతపురంలోని ఆయన స్వగృహంలో కలిసి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. అలాగే బెళుగుప్ప మండలం రామసాగరంలో జనంబాట కార్యక్రమంలో పాల్గొన్న మంత్రికి నిస్వార్థ సేవాసభ్యులు రూ.82,486ల చెక్కును మంత్రి కేశవ్‌కు, కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమాల్లో నిస్వార్థ సేవా సంస్థ సభ్యులు వెంకట్, శర్మాష్, ఎస్కేఆర్సీ క్లబ్ సభ్యులు విజయ్‌భాస్కర్, గుర్రం సుధాకర్, బీసీ మారెన్న, ఎర్రిస్వామి నాయుడు, చాబాల ఎర్రిస్వామి పాల్గొన్నారు.

బెళుగుప్ప: వరద బాధితుల సహాయార్థం విరాళాలు వెల్లువెత్తాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్ కుమార్‌కు దాతలు మండలంలోని రామసాగంలో అందజేశారు. బెళుగుప్పకు చెందిన శ్రీనివాస విద్యానికేతన్ స్కూల్ వారు రూ. 187200ల చెక్కును, సన్ రైజర్స్ విద్యానికేతన్ వారు రూ. 65,501 చెక్కు, స్వాన్స్ క్లబ్ వారు రూ. 65 వేలు చెక్కును అందించారు. వీరిని మంత్రితో పాటు కలెక్టర్ వినోద్‌కుమార్ అభినందించారు.

గుంతకల్లు: విజయవాడలో వరద బాధితులకు మంత్రి సవిత ఆధ్వర్యంలో పట్టణంలోని నిగమ ఫౌండేషన్ వారు సహాయక కార్యక్రమాలు నిర్వహించారు. విజయవాడలోని వివిధ ప్రాంతాల్లో వస్తు సామగ్రి కలిగిన 1200 కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ నిగమ ఫౌండేషన్ వారు వరదబాధితులకు సహాయ సహకారాలను అందించడం అభినందనీయమన్నారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కళ్యాణదుర్గం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ సమన్వయ కమిటీ సభ్యులు రూ. లక్ష విరాళం అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే అమిలినేని సరేంద్రబాబు ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. మండల విద్యాశాఖ అధికారులు శ్రీధర్, తిప్పేస్వామి, ఓబుళపతి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, వినియోగదారుల సంఘం అధ్యక్షుడు చల్లా కిషోర్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, తెలుగు ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం

యాడికి, సెప్టెంబరు 20: ప్రజలకు నిద్రలేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుచేసి ప్రజలకు కూటమి ప్రభుత్వం మంచి చేసిందని మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలో శుక్రవారం ఆయన ఇంటింటికీ వెళ్లి వందరోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, మంచి పనుల గురించి ప్రజలకు వివరించారు. ఇందులో ముఖ్యంగా ల్యాండ్ టైటిలింగ్ రద్దు హర్షణీయమని పేర్కొన్నారు. ఈఓఆర్‌డీ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నీటి పంపింగ్ మోటార్ వైర్ల కత్తిరింపు

● దుశ్చర్యకు పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తులు

ఉరవకొండ, సెప్టెంబరు 20: మండలంలోని నింబగల్లు హెచ్చెల్సీ వద్ద ఉన్న సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్ నీటి పంపింగ్‌కు సంబంధించిన స్టార్టర్‌ను ఆన్ చేసే ఫీజు వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించారు. మోటార్‌కు సంబంధించిన ఫీజు వైర్లు కత్తికించడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన వైర్లు కాలిపోయాయి. దీంతో నీటి పంపింగ్‌కు అడ్డంకులు ఏర్పడ్డాయి. ఉరవకొండకు 4రోజులకు ఒకసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దీన్ని జీర్ణించుకోలేకనే గుర్తుతెలియని వ్యక్తులు ఫీజు వైర్లను కత్తిరించినట్లు తెలుస్తోంది. టీడీపీకి మంచి పేరు వస్తుందన్న ఉద్ధేశ్యంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడ్డారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎవరు కత్తిరించారన్న విషయంపై విచారణ చేపట్టారు.


పీలేరు ఏడీజేగా తాడిపత్రి వాసి

తాడిపత్రి, సెప్టెంబరు 20: చిత్తూరు జిల్లా పీలేరు అడిషనల్ డిస్ట్రిక్ట్ న్యాయాధికారిగా తాడిపత్రికి చెందిన మహేష్ నియమితులయ్యారు. మహేష్ తాడిపత్రి కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహించేవారు. మహేష్ తండ్రి మునెయ్య కూడా సీనియర్ న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులరెడ్డి ఆధ్వర్యంలో మహేష్‌కు శాలువాకప్పి పూలమాలలు వేసి సన్మానించారు. సీనియర్ న్యాయవాదులు రమేష్‌నాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆర్‌సీ రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక రైలు వంతెనల పరిశీలన

గుంతకల్లు, సెప్టెంబరు 20: పట్టణంలో సమస్యాత్మకంగా మారిన రైలు వంతెనలను మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. కసాపురం రోడ్డులో ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తున్న వంతెన, ధర్మవరం గేటు వంతెన, మురుగునీటి సమస్యకు ఆలవాలంగా ఉన్న తిలక్‌నగర్ వంతెనల వద్ద పరిస్థితిని సమీక్షించారు. కసాపురం వంతెన వైడెనింగ్, ధర్మవరం గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణం, తిలక్‌నగర్ వంతెన వద్ద డ్రెయిన్ వ్యవస్థను మెరుగుపరిచడానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ విషయంగా చర్యలు తీసుకోవడానికి రైల్వే అధికారుల అనుమతి అవసరమని పేర్కొన్నారు. టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి డీఆర్ఎంతో మాట్లాడి ఆదివారం రైలు వంతెన విషయంగా మాట్లాడటానికి సమయం కోరారు. కార్యక్రమంలో కమిషనరు వెంకటరమణయ్య, మునిసిపల్ ఇంజనీరు గుర్రప్పగౌడు, సహాయ సిటీ ప్లానర్ సత్తార్ సాబ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు బీఎస్ కృష్ణారెడ్డి, నాయకులు తలారి మస్తానప్ప, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా స్కూల్ గేమ్స్ ప్రారంభం


యాడికిలో కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

యాడికి, సెప్టెంబరు 20: మండలకేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లో శుక్రవారం స్కూల్ గేమ్స్ ప్రారంభోత్సవాన్ని ఎంఈఓ కాశప్ప అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించడం గర్వించదగ్గ విషయన్నారు. క్రీడలతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం పెంపొందడంతో పాటు గెలుపు సాధించాలని లక్ష్యం ఏర్పడుతుందన్నారు. తర్వాత ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ తదితర పోటీలను నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపీపీ ఉమాదేవి, ప్రధానోపాధ్యాయుడు నాగన్న, పీడీ ఓబులమ్మ, ఏఎస్ఐ వెంకటేష్, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, పలువురు పీఈటీలు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ మండలస్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంఈఓ శ్రీదేవి, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. వీటిని ఎంఈఓ2 సుబ్బరాయుడు హాజరై ప్రారంభించారు. మండలంలోని 15పాఠశాలల నుంచి 250 మంది క్రీడాకారు లు పోటీల్లో పాల్గొన్నారు. అండర్14, 17విభాగాలలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా, చెస్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆర్డినేటర్ వేణుగోపాల్, హెచ్ఎం భూపాల్‌రెడ్డి, పీడీలు పాల్గొన్నారు.